


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

ఆదివారం 2 ఆగష్టు 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2




## రైల్వే ఉద్యమ కార్యాచరణపై మూడు కీలక తీర్మానాలు

భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట రైల్వే సాధన సమితి కార్యాలయంలో శనివారం దేగల జనార్ధన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైల్వే ఉద్యమాన్ని తదుపరి దశకు తీసుకెళ్లేందుకు మూడు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సోమవారం రైల్వే ఉద్యమ కరపత్రాన్ని అధికారికంగా ఆవిష్కరించాలని సమావేశం నిర్ణయించింది. అలాగే ఇప్పటికే ప్రజల నుంచి సేకరించిన 10 వేల సంతకాల పత్రాలను బైండింగ్ చేయించి, వాటిని కేంద్ర రైల్వే శాఖ మంత్రికి ఢిల్లీలో స్వయంగా అందజేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తీర్మానించారు. ఆదివారం కోదాడలో రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో విస్తృత సమావేశాన్ని నిర్వహించి ఉద్యమ కార్యాచరణపై చర్చించాలని, కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసేందుకు ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. రైల్వే లైన్ సాధన కోసం ప్రజల మద్దతును మరింత విస్తృతం చేస్తూ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైల్వే సాధన సమితి కో-కన్వీనర్ రాచూరి ప్రతాప్, గౌరవ సలహాదారు లింగంపల్లి భద్రయ్య, సమన్వయకర్త బిక్కుమల్ల ఉపేందర్, కన్వీనింగ్ కమిటీ సభ్యులు నల్లపాటి అప్పారావు, సముద్రాల రాంబాబు, అక్కినేపల్లి రాము, కె. మంజుల, మహంకాళి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.




## దళిత క్రైస్తవులకు ఆగస్టు 10 న "నల్ల దినం"

భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట పట్టణ కేంద్రం నందు తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షులు బిషప్ సి. హెచ్. సాల్మాన్ రాజు, సూర్యాపేట జిల్లా పాస్టర్స్ చైర్మన్ రెవ. డా. శాంసన్ మామిడి, రెవ. బి. జోవహర్ పాల్, బ్రదర్ మీసాల ప్రభుదాసు ప్రెస్ మీట్ లో పాల్గొని మాట్లాడుతూ దేశంలోని రిజర్వేషన్ సంక్షేమ వ్యవస్థలో మత వివక్షకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ భారతదేశంలోని దళిత క్రైస్తవులు దళిత ముస్లింలు ఆగస్టు 10వ తేదీని "నల్ల దినం"గా పాటించాలని ఆ రోజు ఉ. 10:30 గంటలకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఆఫీస్ కు క్రైస్తవులు పాస్టర్స్ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ జిల్లాలో ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగించాలని పిలుపునిస్తూ 1950 రాష్ట్రపతి ఉత్తర్వు ఆగస్టు 10 న , భారతదేశపు మొదటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్, రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాల) ఉత్తర్వుపై సంతకం చేశారనీ ఈ ఉత్తర్వు ప్రకారం, మొదట్లో హిందూ మతాన్ని ఆచరించే వ్యక్తులను మాత్రమే షెడ్యూల్డ్ కుల (SC) సభ్యులుగా గుర్తించవచ్చని పేర్కొనబడిందనీ. తదనంతర సవరణలలో సిక్కులను (1956లో) మరియు బౌద్ధులను (1990లో) చేర్చినప్పటికీ, క్రైస్తవ మరియు ఇస్లాం మతాలలోకి మారిన నిమ్న కులాల వారిని షెడ్యూల్డ్ కుల హోదా నుండి మినహాయించడం కొనసాగిందనీ. దీనివల్ల దళిత క్రైస్తవులకు వారికి విద్య ప్రభుత్వ ఉద్యోగాలలో చట్టబద్ధమైన కోటాలు అందకుండా పోయాయనీ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డైనమినేషన్ బేధం లేకుండా క్రైస్తవులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్రభుత్వ అధికారులకు శాంతియుతంగా వినతిపత్రాలు సమర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో సూర్యాపేట నియోజకవర్గం అధ్యక్షులు రెవ.డా. జలగం జేమ్స్, సీనియర్ పాస్టర్ రెవ. గుంటూరు బాబురావు, రెవ. ఏర్పుల క్రిస్టోఫర్, పాస్టర్ గండమళ్ళ ప్రేమ్ కుమార్, పాస్టర్ పెరుమాళ్ళ ప్రసన్న కుమార్, రెవ. తడంకి కిరణ్ బాబు, రెవ. పుల్లూరు బోయాజ్ తదితరులు పాల్గొన్నారు



## మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై ఎదురొడ్డిపోరాడుదాం








**-ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు కార్మికులకు పిలుపు**

భానుపురి/సూర్యాపేట టౌన్

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రిధికా ఇన్ హోటల్లో జరిగిన ఏఐటియుసి జిల్లా మూడవ మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఐటియుసి జిల్లాలో 31 సంఘాలు, 10 రాష్ట్ర సంఘాలతో ఐదు వేల సభ్యత్వాలతో బలమైన యూనియన్ గా జిల్లాలో కార్మికుల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు. గతంలో పోరాట సాధించుకున్న అనేక హక్కులను నరేంద్ర మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని, 8 గంటల పని విధానం రద్దుచేసి పారిశ్రామిక వేత్తలకు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తున్నారని, సమస్యల పరిష్కారం కోసం చివరి అస్త్రంగా సమ్మెలు చేస్తున్నామని, అయితే సమ్మె చేయడం కూడా చట్ట విరుద్ధంగా ప్రకటించి సమ్మె చేసిన వారిని జైల్లో పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని కార్మిక వర్గాలంతా ఏకం కావాలని నియంతృత్వ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో అందరం పోరాడితేనే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారని, దానివల్ల అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయని అదేవిధంగా హమాలీ సంక్షేమ బోర్డు, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు, ఆశా వర్కర్లు మధ్యాహ్న భోజన కార్మికులు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని అన్నారు. ఈ మహాసభలో కార్మికుల సమస్యలు చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. పిఎఫ్ మీద ఈఎస్ఐ మీద సీలింగ్ ఎత్తివేయాలని, ఆయన సూచించారు.

**ఏఐటియుసి రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ మాట్లాడుతూ**

రాష్ట్ర ప్రభుత్వం కూడా సీఎం రేవంత్ రెడ్డి కార్మికుల సమస్యల మీద ఎటువంటి నిర్ణయాలు తీసుకోవట్లేదని వేతనాలు పెంచడం లేదని గత ప్రభుత్వాలు చేసిన అప్పుల మూలంగా తమ వద్ద నిధులు లేవని చెప్తున్నారని ఆయన అన్నారు. అయితే ఉద్యోగ వేతనాల పెంపు, కాంట్రాక్ట్ కార్మికులు, అంగన్ వాడి కు, ఆశావర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ మహాసభలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాస్,ధూళిపాల ధనుంజయ నాయుడు, దేవవరం మల్లేశ్వరి, జడ శ్రీనివాస్ చామల అశోక్ కుమార్, దంతాల రాంబాబు, బూర వెంకటేశ్వర్లు , గుగులోతు రాజారామ్, తిరుపురం సుధాకర్ రెడ్డి, నిమ్మల ప్రభాకర్, స్వప్న ,కవిత, గోపమ్మ ,ఖమ్మంపాటి రాము, ఎడవెల్లి శ్రీకాంత్, సాయిబాబు, బి శ్యాం సుందర్, ఎస్ కే లతీఫ్, బూర సైదులు సిపిఐ సీనియర్ నాయకులు ఖమ్మం పాటిఅనంతయ్య ,సారి రాఘవ రెడ్డి ,దంతాల పద్మ, రేఖ తదితర కార్మికులు కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.




## ఆర్య వైశ్య మహాసభ యువజన సంఘం ఉపాధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేయనున్న వెంపటి శబరినాథ్

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట కు చెందిన సామాజిక సేవకులు,యువకిశోరము వెంపటి శబరినాథ్ నేడు ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహా సభ యువజన సంఘం ఉపాధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు హైదరాబాద్ లోని లకిడి కపూర్ లో వాసవి సేవా కేంద్రం సెన్సేషన్ థియేటర్ ఎదురుగా గల వాసవి కల్యాణ మండపంలో రాష్ట్ర యువజన సంఘం ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ పాల్గొననున్నారు. వీరితో పాటు యువజన సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం



శాంతి భద్రతల పరిరక్షణ దృశ్య, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణం భంగం కాకుండా, సవ్యంగా కొనసాగించడానికి ఆగస్ట్ ఒకటి నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని మరియు సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలకు తప్పవు అని సూచించారు. నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు.

# జెన్- జీ యువత ను పుగా మాట్లాడిన కంగనా రనౌత్ క్షమాపణలు చెప్పాలి

భానుపురి /సూర్యాపేట న్యూస్

ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా ఆధ్వర్యంలో జరిగిన చారిత్రాత్మక పోరాటంలో పాల్గొన్న యువత గురించి విద్యార్థుల గురించి కారు చౌక కూతలు కూసిన సినీనటి,బిజెపి ఎంపీ కంగనా రనౌత్ బహిరంగ క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీసీ హక్కుల సాధన సమితి కార్యాలయంలో జరిగిన సూర్యాపేట నియోజక వర్గస్థాయి బీసీ హక్కుల సాధన సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... జెన్ జీ ఉద్యమం గురించి, నిరసన కారులను ఉద్దేశించి మురికి కాలువ తరం అని వ్యాఖ్యానించిందని కాక్రోచ్లను చూస్తే కక్కోస్తుందని, తన జీవితంలో ఇంత అసహ్యకరమైన సంఘటనలు చూడలేదని వారిని ఎవరు కన్నారో, ఎవరు పెంచుతున్నారో అర్థం కాలేదని వ్యాఖ్యానించడం ఆమె మూర్ఖత్వానికి పరాకాష్ట అని అయినా బిజెపి ఎంపీలకు ఇంతకంటే సంస్కారవంతం అయిన మాటలు వస్తాయని ఎలా అనుకుంటామని అన్నారు. సౌరవ్ దాస్ పనికిరాని వాడని, నిరుద్యోగి అని 28 ఏళ్ల అతను విద్యార్థి ఎలా అవుతాడని వ్యాఖ్యా నించడం చూస్తుంటే బిజెపి అధినాయకత్వం దృష్టిలో పడాలని తాపయత్రయపడుతున్నట్టుగా ఉన్నదని ఆమె ఏదైనా మంత్రి పదవి ఆశిస్తున్నదా అని అనుమానం వస్తున్నదని, ప్రపంచ వ్యాప్తంగా కాక్రోచ్



ఉద్యమానికి పెద్ద ఎత్తున మద్దతు లభించింది అని మనదేశంలోని సినిమా వాళ్లు క్రీడాకారులు అన్నా హజారే లాంటి ఉద్యమకారులు సంఘీభావంగా నిలిచారని అందువల్ల ఆమె వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు . జన్ –జీ ఉద్యమంలో పాల్గొన్న మహిళల పట్ల అత్యంత అభ్యంతరకర భాషలో మాట్లాడడం ఆమె దిగజారుడు తనానికి నిదర్శనం అని ఉద్యమంలో పాల్గొన్న మహిళలు కనీసం హౌస్ వైఫ్ కు కూడా పనికి రారని వ్యాఖ్యానించడం తగదని జన్ –జీ మహిళలతో వివాదానికి దిగడం ద్వారా తన స్థాయిని తానే దిగదార్చుకున్నారని వ్యాఖ్యానించారు . కంగనా రనౌత్ కు ఇలా మాట్లాడడం కొత్తేమీకాదని 2020 సంవత్స రంలో రైతు ఉద్యమంలో పాల్గొన్న మహిళలను వంద రూపాయల కోసం ఉద్యమంలో కూర్చున్నారని అవమానిస్తే సిఐఎస్ఎఫ్ జవాను కుల్విందర్ కౌర్ కంగనా చెంప పగలగొట్టారని, బహుశా ఆ విషయం కంగనా మరిచిపోయినా దేశ ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఆయన గుర్తు చేశారు. సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు దంతాల రాంబాబు, రాజారాం,, నాయకులు ముత్యాల భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్, బత్తిని శ్రీనివాస్ గౌడ్,,ఎస్కే మీరా సాహెబ్ , పల్సా సైదమ్మ గునగంటి సరస్వతి పాల్గొన్నారు

# వారాంతపు పోలీస్ పరేడ్ నిర్వహణ

భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు పోలీసు పరేడ్ జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ఎస్పి నరసింహ హైజరై సిబ్బంది గౌరవ వందనం స్వీకరించి పరేడ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీసు యూనిఫాంకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉన్నది, యూనిఫాం లో ఉన్న పోలీసు రోడ్డుపై నిలబడితే ప్రజలకు కొండంత ధైర్యం, అండ ఉంటుంది అన్నారు. గర్వంగా ప్రజలకు సేవలు అందించి గౌరవంగా ఉండాలి అని, క్రమశిక్షణ తో ఉంటూ విధుల్లో నైపుణ్యం చూపి సామర్థ్యంతో పని చేయాలని అన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సిబ్బంది వ్యాయామం, యోగ వంటివి ఆచరిస్తూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి, వత్తిడి లేకుండా పని చేయాలని అన్నారు. ఆర్థిక పరమైన క్రమశిక్షణ కలిగి వచ్చే జీతాన్ని సక్రమ మార్గంలో పొదుపు చేసుకోవాలి, పిల్లలను ఉన్నత చదువులు చదివించాలి అన్నారు. పోలీసు సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తాం అన్నారు. పోలీసు శాఖ,



పోలీసు అధికారులు ప్రజలకు సేవలు అందించడంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారు, ప్రజా భద్రత, రక్షణ పోలీసు లక్ష్యం అన్నారు..దీని కోసం రాత్రింబవళ్ళు కృషి చేస్తున్నాము, సాంకేతికత సద్వినియోగం తో ముందుకు వెళుతున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిఎస్పీ లు రవి, ప్రసన్న కుమార్, నరసింహ చారి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ జానయ్య, సిఐ లు వెంకటయ్య, రాజశేఖర్, మగ్దుం అలీ, ఆర్ఎస్ఐ లు, పట్టణ, రూరల్ సర్కిల్స్ ఎస్ఐ లు, సిబ్బంది ఉన్నారు.

## ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

-పల్లె, పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక

-తిప్పర్తి, చందనపల్లి మండలంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటన

-గ్రామ సభల్లో పలు అంశాలు వెల్లడించిన మంత్రి



భానుపురి/ నల్గొండ:

ప్రజల సహకారంతోనే గ్రామాల సంపూర్ణ అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ దిశగా పల్లె ప్రజలు రచ్చబండల వేదికగా తమ సమస్యలను వివరించాలని... క్షేత్రస్థాయిలో పరిష్కారం కోసం కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్గొండ జిల్లా తిప్పర్తి, చందనపల్లి మండలాల్లో పర్యటించి రచ్చబండల వేదికగా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారు. ఇకపై వారంలో ఒక పర్యాయం పల్లెల్లో, ప్రతి ఆదివారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కేంద్రంలో ప్రజలను ప్రత్యక్షంగా కలిసి సమస్యల పరిష్కారానికి, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లనున్నట్లు మంత్రి చెప్పారు.

**పల్లె రోడ్లలో మెరుగైన రవాణా సదుపాయం**

రాష్ట్ర వ్యాప్తంగా రూ.20 వేల కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. రహదారుల విస్తరణ, మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు.

**మహిళా సంఘాలకు రూ.2.5 కోట్ల ఆర్థిక చేయూత**

పెద్దసూరారం గ్రామ మహిళ సంఘాలకు ఆగస్టు 15న రూ.2.5 కోట్ల విలువైన చెక్కులు అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మహిళ సంఘాలు చిన్న వ్యాపారాలతో పాటు రైస్ మిల్లులను నిర్వహించే స్థాయికి ఎదగాలని సూచించారు. సంఘాలకు గరిష్టంగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా తిరిగి చెల్లించాలని మహిళలకు సూచించారు.

**చిన్నసూరారం... పెద్దసూరారం మధ్య రైస్ మిల్లు**

చిన్నసూరారం, పెద్దసూరారం గ్రామాల మధ్య రైస్ మిల్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. అలాగే నల్లగొండ, కనగల్, తిప్పర్తి మండలాల్లో కూడా రైస్ మిల్లుల ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పెద్దసూరారం గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో దశలవారీగా పనులు చేపడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందజేసే బాధ్యత తనపై ఉందని.... సొంత స్థలాలు ఉంటే ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎస్సీ వర్గీకరణ జీవోలను రద్దు పరచాలి



**-మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేసిన మాల మహానాడు ప్రతినిధులు**

భానుపురి/ నల్గొండ:

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్సీ వర్గీకరణ చట్టం, సంబంధిత జీఓలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మాల మహానాడు ప్రతినిధులు శనివారం రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని నల్గొండలో కలిసి వినతిపత్రం అందజేశారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి నేతృత్వంలోని బృందం, షెడ్యూల్ కులాల (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) చట్టం 2025 మరియు జీవో ఎంఎస్ నెంబర్ 9, 10, 99 ద్వారా మాల మరియు దాని 25 ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. 100 పాయింట్ల రోస్టర్ విధానంలో ప్రారంభ పాయింట్లలో మాలలకు అవకాశం లేకపోవడంతో చిన్న నోటిఫికేషన్లలో ఉద్యోగాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ జీఓలను వెంటనే రద్దు చేస్తూ... 1 నుంచి 16 రోస్టర్ పాయింట్లలో మాలలకు కనీసం 2 పాయింట్లు కేటాయించాలన్నారు. రోస్టర్ పునర్వ్యవస్థీకరణ వరకు అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రంలోని అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి లింగమయ్య, ఎన్నమల్ల అనిల్, చింతపల్లి బాలకృష్ణ, చిలుకూరి అభినవ్, చింతపల్లి వెంకన్న, అనుములపూరి సుధాకర్, రావిరాల వరప్రసాద్, బోగరి రవీందర్, ఎర్రమళ్ళ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల కళాశాల తనిఖీ చేసిన అదనపు కలెక్టర్





భానుపురి/యాదాద్రి భువనగిరి

కేజీబీవీ రెసిడెన్షియల్ బాలికల కళాశాలను యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందేలా చూడాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.శనివారం మోత్కూర్‌లోని కేజీబీవీ రెసిడెన్షియల్ బాలికల కళాశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థినులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, విద్యాబోధన తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది యొక్క హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేశారు.కళాశాలలోని స్టోర్ రూమ్‌ను, విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న విద్యాబోధన, భోజన నాణ్యత, వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థినులతో నేరుగా మాట్లాడి విద్యాబోధన, భోజనం, వసతులు, ఇతర సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం మోత్కూర్ ఎంపిడిఓ కార్యాలయంలో పట్టణంలో తాగునీటి సరఫరా పరిస్థితి పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మోత్కూర్ పెద్ద చెరువు కట్ట మరమ్మతుల కారణంగా మిషన్ భగీరథ నీరు రాకపోవడం పై ఆరా తీయగా గ్రిడ్ పైప్ లైన్ స్వల్పంగా దెబ్బతిన్న నేపథ్యంలో పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి చేయించడంతో ప్రస్తుతం నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. తాగునీటి సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి సరఫరా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలాజీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.